సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

జగ్జీవన్‌రాంనగర్ కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 5 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బస్టాండ్ పక్కన ఉన్న జగ్జీవన్‌రాంనగర్ కాలనీలో డ్రైనేజీ, ఇంటి పరిసరాలను పరిశీలించారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. డ్రైనేజీలోకి చెత్తాచెదారం చేరకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇంటి ఆవరణలో, రోడ్లపై చెత్తాచెదారం వేయవద్దని తెలిపారు. మున్సిపల్ ఆటోలు చెత్తసేకరణకు కాలనీలోకి వస్తున్నాయా అంటూ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూలకుండీలు, టైర్లు, కొబ్బరి బోండాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. అనంతరం కాలనీలోని కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. లైటింగ్, డోర్లు లేకపోవడంతో వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ రామ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్ మృతి పార్టీకి తీరనిలోటు

గోపాల్ పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), జూలై 5: కౌకుంట్లకు చెందిన ఉమ్మడి దేవరకద్ర మండల మాజీ ఎంపీపీ ఈవీ గోపాల్ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలియడంతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని గోపాల్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గోపాల్ మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటు అన్నారు. అనంతరం పాడె మోశారు. అలాగే మాజీ ఎంపీపీ రమాదేవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు నివాళులర్పించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

పాలమూరు, జూలై 5: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్‌సుమన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆయన మొక్కలు నాటారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 15జూనియర్ కళాశాలల్లో 2,500లకు పైగా మొక్కలు నాటడానికి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కౌసర్‌జహా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, డీఐఈవో కార్యాలయ సిబ్బంది సందీప్, సాధిక్ పాల్గొన్నారు.

మురుగు నిల్వలేకుండా చూడాలి

- జిల్లా వైద్యాధికారి కృష్ణ

భూత్పూర్, జూలై 5: ఇండ్ల మధ్యన మురుగు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణ అన్నారు. శుక్రవారం ఫ్రై డే డ్రై-డే కార్యక్రమాన్ని మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ 7వ వార్డులో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇండ్లమధ్య ఉన్న డ్రైనేజీలు, ఇండ్లల్లో ఉన్న నీటి సంపులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ అబ్దుల్, సీహెచ్‌వో అయూబ్‌ఖాన్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

మూసాపేట, జూలై 5: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తాసీల్దార్ బ్రహ్మంగౌడ్ సూచించారు. మండలంలోని తిమ్మాపూర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామసభ నిర్వహించి గ్రామస్తులతో చర్చించి, సమస్యలపై ఆరా తీశారు. 10నెలల పాప పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్లు తెలియడంతో వారి ఇంటికి వెళ్లి పరిశీలించారు. పౌష్టికాహారం అందించాలని రూ.2వేలు సొంతంగా అందజేశారు. శిశుసంక్షేమ అధికారికి ఫోన్‌లో పాప సమాచారం అందించారు.

పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరం

దేవరకద్ర, జూలై 5: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని పంచాయతీ కార్యదర్శి సీతానాయక్ చెప్పారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు వార్డుల్లో తిరిగి ఇంటిముందు కుళాయి గుంతలు, గచ్చులను పరిశీలించి, ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన నీటిని పారబోశారు.

గడువు పొడిగింపు

నారాయణపేట, జూలై 5: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండో విడుత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15 వరకు గడువు పొడిగించినట్లు ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ వేమారెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. 8 లేదా పదో తరగతి పూర్తి చేసినవారు అర్హులని, 1-8-2024 నాటికి 14ఏండ్లు పూర్తయ్యి ఉండాలని, రూ.100 రుసుం చెల్లించి https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హాల్‌టికెట్లు విడుదల

పాలమూరు, జూలై 5: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రవేశ పరీక్ష రాసేందుకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో అర్హత కలిగిన అభ్యర్థులందరూ డీఈ ఈసెట్-2024 ద్వారా రెండేండ్లు విద్యనభ్యసించేందుకు హాల్‌టికెట్ విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ ప్రకటనలో పేర్కొన్నారు. హాల్‌టికెట్లను HTTP://DEECET.CDSE.TELANGANA.GOV.IN వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పోస్టులు భర్తీ చేయాలి

ఊట్కూర్, జూలై 5: గురుకులాల్లో బ్యాక్‌లాగ్ పేరుతో పోస్టులు ఖాళీ పెట్టకుండా నోటిఫికేషన్‌లో ఇచ్చిన పోస్టులన్నింటినీ భర్తీ చేసి 1:2 సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని అభ్యర్థులు నర్సింహా, రాకేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. గురుకులాల్లో 9,210 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చారని, అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికవడంతో మిగిలిన పోస్టులకు మెరిట్ లిస్ట్ తర్వాత స్థానాల్లో ఉన్నవారితో భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో సురేందర్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325758

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

నిరుద్యోగులను మోసగిస్తున్న కాంగ్రెస్

- కలెక్టరేట్‌ల ఎదుట నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల ఆందోళన
- ఎన్నికల హామీ మేరకు ఉద్యోగాల భర్తీ, మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్
- పోలీసుల ముందస్తు అరెస్టులు

మహబూబ్‌నగర్‌లో జేపీకి వినతిపత్రం అందిస్తున్న బీజేవైఎం నాయకులు

ఊట్కూర్: పోలీసుల అదుపులో జీజేపీ, బీజేవైఎం నాయకులు

మక్తల్‌లో బీజేవైఎం నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

జడ్చర్ల పోలీసుల అదుపులో బీజేవైఎం, విద్యార్థి సంఘాల నాయకులు

భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో బీజేవైఎం నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 5: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, గత ప్రభుత్వంలో భర్తీ చేసిన ఉద్యోగాలకు సంబంధించిన నియామకపత్రాలు ఇచ్చి చేతులు దులుపుకొన్నదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జేసీ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. నిరుద్యోగులకు న్యాయం చేసే వరకు తమ పోరాటం ఆగదన్నారు. 25వేలతో మెగా డీఎస్సీ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, శ్రీధర్, వెంకటేశ్, శివకుమార్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేసే వరకు పోరాటం

ఊట్కూర్, జూలై 5: ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీజేపీ, బీజేవైఎం నాయకులు కృష్ణయ్యగౌడ్, రమేశ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. 25వేల పోస్టులతో మెగా డీఎస్సీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం చేసే వరకు పోరాడుతామన్నారు.

మక్తల్‌లో ముందస్తు అరెస్ట్..

మక్తల్, జూలై 5 : ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయాల ముట్టడికి వెళ్తున్న బీజేవైఎం, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ నాయకులను శుక్రవారం మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని మండిపడ్డారు. వెంటనే డీఎస్సీ చేపట్టి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తే అరెస్టులు చేయడం సరికాదన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం నాయకులు నరసింహ, అంజి, రాజు, శీను, నవీన్, పీడీఎస్‌యూ నాయకుడు భాస్కర్ తదితరులు ఉన్నారు.

మహ్మదాబాద్‌లో..

మహ్మదాబాద్, జూలై 5 : నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామని బీజేవైఎం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో బీజేపీ నాయకులను శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరహరి రెడ్డి, ఉపాధ్యక్షులు రాజు, బద్రేశ్వర్, మల్కయ్య, బీజేవైఎం మండలాధ్యక్షుడు రవీందర్, శ్రీనివాస్ ఉన్నారు.

జడ్చర్లలో..

జడ్చర్ల టౌన్, జూలై 5 : నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు నిరుద్యోగ ర్యాలీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో జడ్చర్ల పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టు చేశారు. బీజేవైఎం, విద్యార్థి సంఘాల నాయకుల ఇండ్ల వద్దకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. బీజేవైఎం నాయకులు నరేశ్, అనిల్‌కుమార్, ఏబీవీపీ నాయకులు సాయికుమార్, శ్రీనాథ్, గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు వడిత్య రమేశ్‌నాయక్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

మరికల్‌లో..

మరికల్, జూలై 5 : నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైఎం నాయకులు తలపెట్టిన నిరసన నేపథ్యంలో శుక్రవారం పోలీసులు నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో వేణుగోపాల్, నరేశ్‌గౌడ్, వెంకటేశ్, రాజేశ్, రమేశ్, రాజశేఖర్, నిఖిల్ తదితరులు ఉన్నారు.

భూత్పూర్‌లో..

భూత్పూర్, జూలై 5: బీజేవైఎం కలెక్టరేట్ ముట్టడిని అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తుగా శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఫారూఖ్, బీజేవైఎం మండల నాయకులు శ్రీశైలం, మల్లేశ్, రామును ముందస్తుగా అరెస్ట్ చేశారు.

మహ్మదాబాద్‌లో పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు

మరికల్‌లో బీజేపీ, బీజేవైఎం నాయకుల అరెస్టు

టిప్పర్ ఢీ: సెక్యూరిటీ గార్డు మృతి

బాలానగర్, జూలై 5 : బాలానగర్ సమీపంలోని ఓ క్రషర్ పరిశ్రమలో టిప్పర్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతిచెందిన ఘటన చోటుచేసుకున్నది. ఎస్సై తిరుపాజీ కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన లాలూ(28) బాలానగర్ సమీపంలోని క్రషర్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 12:30 గంటల ప్రాంతంలో పరిశ్రమలో నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్ లాలూను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లాలూ అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం లాలూ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాలమూరులో భారీ వర్షం

మహబూబ్‌నగర్, జూలై 5: పాలమూరులోని పలుప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లపై నీళ్లు నిలువడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో 2మి.మీ.వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 5: జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్డు స్కూల్ ఎదురుగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతు పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవాబ్‌పేట, జూలై 5 : మండలంలోని కూచూర్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతుల నేపథ్యంలో కూచూర్, దొడ్డిపల్లి, హన్మసానిపల్లి, ఇప్పటూర్, మల్లారెడ్డిపల్లి, చెన్నారెడ్డిపల్లి, కారూర్, గోవోనిపల్లి గ్రామాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సంతోష్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

పాలమూరు, జూలై 5 : భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమని మాజీ ఐఏఎస్ అధికారి ఎల్‌వీ సుబ్రమణ్యం అన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రతిభ కనబర్చిన తెలుగు మీడియం విద్యార్థినులకు గ్రామీణ భాగస్వామ్య సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, గ్రామీణ భాగస్వామి ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ టీకేఎస్ శర్మ పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

మాగనూరు, జూలై 5 : మండలంలోని ఓబ్లాపూర్ గేట్ సమీపంలో పొలం నుంచి ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు తాసీల్దార్ సతీశ్‌కుమార్ తెలిపారు. ఆర్ఐ శ్రీశైలం అందించిన సమాచారం మేరకు టిప్పర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

పాలమూరు, జూలై 5 : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కళాశాలలో వాణిజ్య శాస్త్రం విభాగం, వినియోగదారుల ఫోరం, వినియోగదారుల సంఘాల సమాఖ్య, వినియోగదారుల సంరక్షణ మండలి, సమాచార విభాగం సంయుక్తంగా వినియోగదారుల పరిరక్షణ చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వస్తుసేవలు, కల్తీనూనెలు, అలాగే ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- గ్రామ పంచాయతీ కార్మికుల ఆందోళన

నారాయణపేటలో ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

నారాయణపేట, జూలై 5: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాము, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి మున్సిపల్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతినెలా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం తాసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బుట్టు, రామాంజనేయులు, ప్రశాంత్, నారాయణ, సుశాంత్, మహదేవ్, పరశురాం పాల్గొన్నారు.

మాగనూరులో..

మాగనూరు, జూలై 5: సమస్యలపై పోరాడితే ప్రభుత్వం అక్రమ అరెస్టులను చేయించడం సిగ్గుచేటని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు విమర్శించారు. చలో కొడంగల్ కార్యక్రమానికి తరలివెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు అడ్డుకొని శుక్రవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలల్లోనే పరిపాలన చేతకాదని నిరూపించిందన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడితే అరెస్టులు చేస్తారా అని మండిపడ్డారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శోభ, తులసి, జగదీశ్వరి, మహేశ్వరి, ముద్దమ్మ ఉన్నారు.

మక్తల్‌లో..

మక్తల్, జూలై 5 : అక్రమ అరెస్టులను మానుకొని అంగన్‌వాడీలకు రూ.2లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్‌ను కల్పించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ గోవిందరాజ్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి మంజుల అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చలో కొడంగల్ కార్యక్రమాన్ని చేపట్టిన సందర్భంగా పోలీసులు అంగన్‌వాడీ టీచర్లను అరెస్ట్ చేశారు. అరెస్టును వారు తీవ్రంగా ఖండించారు. మహిళలని కూడా చూడకుండా అరెస్టులు చేయడం విచారకరమన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు అరెస్ట్..

మరికల్, జూలై 5 : అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చలో కొడంగల్ వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్‌ను పలు వామపక్ష పార్టీలు, సంఘాల నాయకులు ఖండించారు.

అక్రమ అరెస్టులు మానుకోవాలి

నారాయణపేట టౌన్, జూలై 5 : అంగన్‌వాడీలకు రూ.2లక్షల రిటర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఉద్యమిస్తుంటే ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రాం అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున యూనియన్ నాయకుల ఇంటికి వెళ్లి అక్రమ అరెస్టులు చేస్తున్న ప్రభుత్వ వైఖరిని వారు తీవ్రంగా ఖండించారు.

సింగరేణి వేలాన్ని నిలిపివేయాలి

మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

నారాయణపేట, జూలై 5 : సింగరేణి వేలం పాటను వెంటనే నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పార్క్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వదేశీ, మోదీ గ్యారెంటీ నినాదాలతో 3వసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం జాతీయ వనరులు, ఖనిజాలు, జాతి సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్నదన్నారు. దేశంలోని 500 కోల్‌బ్లాక్‌లో ఇప్పటికే 300 బ్లాక్‌లను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసిందన్నారు. కోల్ ఇండియా, సింగరేణి లాంటి ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయకుండా, ప్రైవేట్ వర్గాలకు అమ్మి మన ధర్మల్ స్టేషన్లకు కావాల్సిన బొగ్గును వారి నుంచి కొనుగోలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే సత్తుపల్లి, కోయగూడెం ఓసీలను అరబిందో మరో సంస్థకు వేలం నిర్వహించడం జరిగిందని, ఇప్పుడు మరో 3 బ్లాక్‌లను వేలానికి పెట్టిందన్నారు. సింగరేణిని ఆపరేట్ చేస్తున్న 39 బ్లాకులలో కొన్ని ఓసీలు, అండర్ గ్రౌండ్ మైన్స్ మూతపడ్డాయని, రానున్న పదేండ్లలో మిగిలినవి మూతపడే పరిస్థితులు ఉన్నాయన్నారు. సింగరేణి సంస్థకు మన రాష్ట్రంలో కోల్ మైన్స్ ఉచితంగా ఇవ్వాలని, వేలంపాట నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాము, ప్రశాంత్, నరసింహ, నారాయణ, నరసింహ, సాయికుమార్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో..

మహబూబ్‌నగర్, జూలై 5 : కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేపట్టారు..ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశంలోని సహజ సంపదను దోచి అదానీ, అంబానీ వంటి కుబేరులకు కట్టబెడుతున్నదని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, సురేశ్, రాంచందర్, కిల్లె గోపాల్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

జడ్చర్ల టౌన్, జూలై 5 : మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో నివాసముంటున్న లలిత అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కౌన్సిలర్ జ్యోతీకృష్ణారెడ్డి శుక్రవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

జడ్చర్ల టౌన్, జూలై 5: మండలంలోని నాగసాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సావిత్రి శుక్రవారం కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో టెన్త్ విద్యార్థిని హర్షితకు రూ. 2వేలు ఆర్థికసాయం అందించారు. ప్రతినెలా రూ.2వేల చొప్పున ఏడాదిపాటు ఆర్థికసాయం అందిస్తానని ఉపాధ్యాయురాలు హామీ ఇచ్చారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

మొక్క నాటుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 5 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఆకుపచ్చ పాలమూరు సాధనకు ప్రజలంతా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మెరుగై